క్లుప్తంగా

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బాయికాడి పద్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొంటారని తెలిపారు. లబ్ధిదారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు



విజేతగా నిలిచిన వెంకీ వారియర్స్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో మూడు రోజులు నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఫైనల్ పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్‌లో వెంకీ వారియర్స్, ఎస్‌పీఎల్ కింగ్స్ తలపడగా వెంకీ వారియర్స్ గెలుపొందారు. విజేతలకు మాజీ సర్పంచ్ నర్సయ్య చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వీపీఎల్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఏటా క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

రంగాయపల్లిలో పందుల వీర విహారం



రంగాయపల్లిలో సంచరిస్తున్న పందులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని రంగాయపల్లి గ్రామంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అసలే వర్షాకాలం.. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పంచాయతీ అధికారులు దృష్టి సారించి పందులను గ్రామ శివారులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

రోడ్డుపైనే వ్యర్థాల కాల్చివేత



కొండాపూర్ శివారులో రోడ్డుపైనే వ్యర్థాలను తగలబెడుతున్న అగర్వాల్ పరిశ్రమ

మనోహరాబాద్(తూప్రాన్): పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను రోడ్డుపైనే వేసి తగలబెడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులోని అగర్వాల్ పరిశ్రమ సిబ్బంది నిత్యం పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను రోడ్డుపైనే తగలబెడుతున్నారు. దీంతో రోడ్డు వెంట వెళ్లే వారికి దుర్వాసనతో పాటు, కండ్లు మండుతున్నాయని వాపోతున్నారు. అధికారులు దృష్టి సారించి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పైప్‌లైన్ల కోసం రోడ్డు ధ్వంసం



సామ్లా తండా శివారులో తవ్వేసిన రోడ్డు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రోడ్డు వేసి ఏడాదైనా పూర్తి కాలేదు. మరో 800 మీటర్ల రోడ్డు పనులు జరగాల్సి ఉండగా రూ. 6.7 కోట్ల ఖర్చుతో వేసిన రోడ్డును పైపులైన్ల కోసం అడ్డంగా తవ్వేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిలప్‌చెడ్ మండలం శీలాంపల్లి గేటు నుంచి అంతారం గేటు వరకు సుమారు 9 కిలోమీటర్ల రోడ్డును కొత్తగా వేశారు. మధ్యలో ఉన్న సామ్లా తండా శివారులో గల రోడ్డును పైప్‌లైన్ల పేరిట ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే సుమారు 10 చోట్ల అడ్డంగా తవ్వేశారు. రోడ్డు బాగుందని వేగంగా వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయమై చర్య తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా బోనాలు ఊరేగింపు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం దామర్‌చెరువులో శనివారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి గ్రామస్తులు మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఆత్మ చైర్మన్ రాంసింగ్, మాజీ జెడ్పీటీసీ నర్సింహరెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వర్ పాల్గొన్నారు.

‘ఉపాధి’లో పశువుల పాకలు

- వందశాతం సబ్సిడీ..
- పాడి రైతులకు ప్రయోజనం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



చిట్కుల్ పూర్తయిన పశువుల పాక నిర్మాణం

చిలప్‌చెడ్(నర్సాపూర్): పాడి రైతులకు ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందిస్తోంది. ఉపాధి హామీలో వందశాతం రాయితీతో పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు అర్హులైన పాడి రైతులు 25 పశువుల పాకలు నిర్మించారు. అలాగే మండలానికి రూ. 3 లక్షల సబ్సిడీతో మంజూరైన కోళ్లఫాం నిర్మాణం సైతం జరుగుతుంది. ఇప్పటికైనా అర్హులు దరఖాస్తు చేసుకుంటే, వారికి సైతం పశువుల పాకలతో పాటు, నాటు కోళ్లు, జీవాల పెంపకానికి సైతం షెడ్ల నిర్మాణాలకు అవకాశం కల్పిస్తామని అధికారులు చెబుతున్నారు. కాగా ప్రభుత్వం నిబంధనల ప్రకారమే షెడ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచిస్తున్నారు. పశువుల పాకలు నిర్మించే వారికి తప్పనిసరిగా ఉపాధి జాబ్ కార్డు ఉండడంతో పాటు, ఐదెకరాలలోపు భూమి ఉండాలన్నారు. నిబంధల ప్రకారం 5 మీటర్ల పొడవు, 4 మీటర్ల వెడల్పు, 2.4 మీటర్ల ఎత్తుతో నిర్మించాలన్నారు. ఈ కొలతలతో నిర్మించిన షెడ్‌లో 3 నుంచి 6 వరకు పశువులు ఆవాసం కల్పించవచ్చు. సరైన కొలతలతో షెడ్ నిర్మిస్తే ప్రభుత్వం గరిష్ఠంగా రూ. 85 వేలు అందిస్తుందన్నారు. కాగా షెడ్ నిర్మాణానికి లబ్ధిదారుడే ముందుగా ఖర్చు చేయాల్సి ఉంటుందని, నిర్మాణం పూర్తయ్యాక డబ్బులు ఖాతాలో జమ అవుతాయని చెబుతున్నారు.

ఎంతో ఉపయోగకరం



పశువుల పాక నిర్మాణం పాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఒకప్పుడు పశువులను మేపేందుకు ఇబ్బంది పడే వాడిని, పాక నిర్మాణం తర్వాత పశుపోషణ సులభం అయింది. కాగా పాక నిర్మించి, నాలుగు నెలలు పూర్తయినా డబ్బులు రాలేదు. ముందుగానే డబ్బులు వచ్చే విధంగా అధికారులు చర్య తీసుకుంటే ఎక్కువ మంది అర్హులు పాకలు నిర్మించుకునే అవకాశం ఉంటుంది.

– ప్రకాష్, రైతు, చిట్కుల్

అర్హులైన ప్రతి ఒక్కరికి అవకాశం



మండలంలో పశువుల పాకల నిర్మాణాల్లో సుమారుగా అనుకున్న లక్ష్యాన్ని సాధించాం. అర్హులైన వారు ఎంతమంది దరఖాస్తు చేసుకున్న ఉపాధి హామీలో అవకాశం కల్పిస్తాం. కాగా ముందుగా డబ్బులు ఇచ్చే అవకాశం లేదు. నిర్మాణం తర్వాతే డబ్బులు వస్తాయి. నాటు కోళ్లు, జీవాల షెడ్ల నిర్మాణాలకు అవకాశం ఉంది. ఇప్పటివరకు దాదాపు అందరి ఖాతాల్లోకి డబ్బులు పడ్డాయి.

– శ్యామ్, ఏపీఓ, చిలప్‌చెడ్

పొలాల దారి కోసం రాస్తారోకో



చేగుంట-బోనాల్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

చేగుంట(తూప్రాన్): వ్యవసాయ పొలాలకు వెళ్లే దారిని మూసేస్తున్నారని అనంతసాగర్‌తోపాటు చేగుంట రైతులు బోనాల్ రహదారిపై శనివారం రస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేగుంట శివారులోని జీవిక పరిశ్రమ విస్తరణ కోసం యాజమాన్యం ప్రహరీ నిర్మిస్తున్నారు. అందుకోసం వారు అనంతసాగర్ గామ క్రీడాప్రాంగణంతో పాటు రైతుల పొలాలకు వెళ్లేదారిని కూడా మూసేస్తు నిర్మాణం చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని పొలాలకు వెళ్లడానికి దారి ఇవ్వడానికి యాజమాన్యంతో ఒప్పందం చేయించారు. దీంతో రైతులు శాంతించి రాస్తారోకో విరమించారు.

రామాయంపేట బస్టాండ్ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్ఎం విజయభాస్కర్

రామాయంపేట(మెదక్): ఆర్టీసీ బస్టాండ్లలో స్టాల్స్ వద్ద విధిగా మెనూ ఏర్పాటు చేయాలని ఆర్ఎం విజయభాస్కర్ ఆదేశించారు. శనివారం రామాయంపేట బస్టాండ్‌ను తనిఖీ చేసి ప్రయాణికులతో మాట్లాడారు. ఈసందర్భంగా స్టాల్స్‌తో పాటు మరుగుదొడ్లు, తాగు నీటి వసతిని పరిశీలించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తామన్నారు. ఆయన వెంట కంట్రోలర్ ప్రసాద్, ఇతర అధికారులున్నారు.

585 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి తదితరులు

నారాయణఖేడ్: జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 585 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మంథాని మాట్లాడుతూ.. రాజీ మార్గమే రాజా మార్గమని, సామరస్యంతో కేసులు పరిష్కరించుకోవడం మంచిదన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు నర్సారెడ్డి, మారుతిరెడ్డి, నర్సింహారావు, కోర్టు సిబ్బంది, బ్యాంకర్లు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 970 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి జి.కవితాదేవి, జడ్జి ఎండీ. అబ్దుల్ ఖలీల్ రాజీ మార్గంలో కేసులను పరిష్కరించారు. వీటిలో సీనియర్ కోర్టు విభాగంలో 64 బ్యాంక్ పియల్సి కేసులు, 8 సైబర్ క్రైం, 5 సివిల్ కేసులు పరిష్కారమయ్యాయి. రూ.44,49,714 లక్షలు వసూలయ్యాయి. జూనియర్ సివిల్ కోర్టు విభాగంలో 6 సివిల్ కేసులు, 76 క్రిమినల్ కంపౌండ్, 34 అడ్మిషన్, 828 ఎస్‌టీసీ, 12 అబ్కారి మొత్తం 970 కేసులు పరిష్కారం కాగా రూ.6,77,850 లక్షలు వచ్చాయి. ఈ సందర్భంగా జడ్జి కవితాదేవి మాట్లాడుతూ.. కేసుల వల్ల అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతాయని, రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని చెప్పారు. లోక్‌అదాలత్‌లో డీఎస్పీ సైదా నాయక్, సీఐ శివలింగం, ఎస్ఐలు వినయ్‌కుమార్, కాశీనాథ్, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేటలో 228 కేసులు

జోగిపేట(అందోల్): జోగిపేట జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన నేషనల్ లోక అదాలత్‌లో 228 కేసులు పరిష్కారం అయినట్లు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా తెలిపారు. వీటిలో భూములకు సంబంధించిన కేసులు 5, బ్యాంకు కేసులు 2, సైబర్ క్రైమ్ కేసులు 2, ఎక్సైజ్ శాఖ కేసులు 4 క్రిమినల్ కేసులు 215 పరిష్కరమయ్యాయని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు ఎస్.నారాయణరెడ్డి ఎస్.కృష్ణారెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రారెడ్డి జోగిపేట సీఐ అనిల్‌కుమార్, జోగిపేట బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాలు ఎరువులు సిద్ధం

నర్సాపూర్: వర్షాకాలం సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సిద్ధంగా ఉన్నాయని సంఘం చైర్మన్ రాజు యాదవ్ శనివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. తమ సంఘంలో జీలుగ విత్తనాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఆర్ఎన్ఆర్ 15048 రకం విత్తనాలు 50బస్తాలు, కేఎన్ఎం 1638 రకం విత్తనాలు 80 బస్తాల వరి విత్తనాలు సబ్సిడీపై ఉన్నాయని ఆయన చెప్పారు. యూరియా, గ్రోమోర్ రసాయన ఎరువులు సైతం సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. రైతులు తమకు అవసరమైన ఎరువులు, విత్తనాలు తమ సంఘం గోదాంలో కొనుగోలు చేసి తీసుకెళ్లాలని కోరారు.

13 మంది జూదరుల అరెస్టు

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి శివారులో జూదం ఆడుతున్న పలువురిని శనివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గ్రామ శివారులో జూదం ఆడుతున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు టాస్క్‌పోర్స్ పోలీసులతోపాటు స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 13 మందిని అరెస్టుచేసి వారివద్దనుంచి రూ. 1,4330 నగదుతోపాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

నర్సాపూర్ రూరల్: భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని పెద్ద చింతకుంట, నత్నయ్యపల్లి గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలు ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

ఆరోగ్య కేంద్రంలో శుభ్రత పనులు



సిబ్బందితో కమిషనర్ మధుసూదన్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాలతో పాటు పలు కాలనీల్లో రోడ్లపై ఉన్న చెత్తా చెదరాన్ని శుభ్రం చేయించారు. వీధి కుక్కల బెడదను ఎనిమల్స్ బర్త్ కంట్రోల్ సిబ్బంది సమస్యను పరిష్కరించారు. ప్రణాళిక కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్వో నర్సింలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్, ఆరోగ్య కేంద్ర, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జహీరాబాద్: మహిళలు ఆర్థికంగా ఎదిగాలని ఎస్‌బీఐ బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం జహీరాబాద్‌లోని సుభాష్‌గంజ్‌లో మైత్రి మహిళా డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వ ర్యంలో మహిళలకు అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సులభంగా రుణసదుపాయం పొందాలన్నా ఉద్యం సర్టిఫికెట్‌ను పొందాలని సూచించారు. సబ్సిడీలతో పాటు ప్రభుత్వ పథకాలు పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. సంఘం అధ్యక్షురాలు జె.అన్నపూర్ణ మాట్లాడుతూ ఉద్యం సర్టిఫికెట్ విశిష్టతను తెలియజేశారు. ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్‌ను ఉచితంగా పొందవచ్చన్నారు. సమావేశంలో మహిళా సంఘాల సభ్యులు, చిరువ్యాపారులు పాల్గొన్నారు.

ధర్మపరిరక్షణకు కృషి చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న వీహెచ్‌పీ నాయకులు

పాపన్నపేట(మెదక్): హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్మల సత్యం పిలుపునిచ్చారు. శనివారం ఏడుపాయలలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తి భావం పెంపొందించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. హిందువులు ఐకమత్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా భజరంగ్‌దళ్ విద్యార్థి ప్రముఖ్‌గా బోల కృష్ణ, పాపన్నపేట మండల ప్రఖండ ప్రముఖ్‌గా మల్లేశంను నియమించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పబ్బ సత్యనారాయణ, మెదక్ సంఘటన కార్యదర్శి మల్లేశం, జిల్లా కార్యదర్శి నీలశ్యాం, భజరంగ్‌దళ్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చాకరిమెట్లలో భక్తుల పూజలు



ఆంజనేయస్వామికి అర్చకుల పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల అరణ్యంలో కొలువైన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొన్నది. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, మన్యసుక్త పారాయణం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులు సత్యనారాయణ స్వామి మండపంలో సామూహిక వ్రతాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, తదితరులు ఉన్నారు.

నేడు నల్లపోచమ్మకు బండ్ల ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో నల్లపోచమ్మ

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌లో వెలిసిన గ్రామ దేవత మాత నల్ల పోచమ్మ అమ్మవారికి ఆదివారం బండ్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు లింగారెడ్డి, మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతియేటా మృగశిర కార్తెను పురస్కరించుకుని పట్టణంలోని రైతులంతా తమ ఎడ్ల బండ్లను ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారి ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహిస్తారని తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, భక్తులు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



శ్రీకాంత్‌ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): పిడుగుపాటుతో మృతిచెందిన బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల పరిధి గూడూర్ గ్రామానికి చెందిన కొత్తకుమ్మరి సత్తమ్మ శుక్రవారం పిడుగుపాటుతో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. గాయపడిన శ్రీకాంత్‌ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు పబ్బ రమేష్‌గుప్తా, కల్లూరి హరికృష్ణ, మన్సూర్, యాదగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, హన్మంతు, మురళి, తదితరులు ఉన్నారు.

రెండు కార్లు ఢీ: ముగ్గురికి గాయాలు



దెబ్బతిన్న వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

తూప్రాన్: రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వెంకటాయిపల్లి గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ యాదగిరి కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తికి చెందిన కర్రోల్ల నర్సింలు, మైలారం సుకుమార్, నారాయణ ముగ్గురు కలిసి బొలెరో వాహనంలో మాసాయిపేట మండల కేంద్రంలో నర్సరీలో చెట్ల కోసం వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో వెంకటాయిపల్లి శివారులో ఎదురుగా వచ్చిన కారు అతివేగంగా వచ్చి వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు గాయపడ్డారు. రెండు కార్ల దెబ్బతిన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న కిషన్‌సింగ్, తదితరులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలంలోని విశ్వపాలిని జ్వాలముఖి భవాని సమేత సేవలాల్ మహరాజ్ మహా మందిరంలో శనివారం ఏక వింశతి చండీయాగం ఘనంగా నిర్వహించారు. మందిరం ధర్మకర్త, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్‌సింగ్-లలిత దంపతుల ఆధ్వర్యంలో యాగం చేపట్టారు. ప్రముఖ జ్యోతిశ్య వాస్తు శాస్త్ర పండితులు చంద్రమౌళి శర్మ నేతృత్వంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు చెందిన అంకుశ్‌శర్మ, మందిరం పురోహితులు మనోజ్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రలు పఠించారు. హారతి, తీర్థప్రసాదం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తండా ప్రముఖులు శంకర్, ఖత్రోత్ జైల్‌సింగ్, రూప్‌సింగ్, కిషన్, రాములు, మన్మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

అంతా ఆన్‌లైన్‌లోనే...

పెరుగుతున్న డిజిటల్ పేమెంట్లు



మెదక్‌లో బజ్జీల బండికి మూడు క్యూఆర్‌కోడ్ స్టిక్కర్లు

మెదక్ కలెక్టరేట్: రోజు రోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో సమాజంలో ఎక్కడ చూసిన క్యాష్‌లెస్ డిజిటల్ చెల్లింపులే జరుగుతున్నాయి. దీంతో జేబుల నిండా డబ్బులు తీసుకెళ్లే అవసరం కూడా లేకుండా పోతుంది. చిరు వ్యాపారుల నుంచి షాపింగ్ మాల్స్ వరకు అంతా డిజిటల్ చెల్లింపులనే ప్రోత్సాహిస్తున్నారు. జేబులో రూపాయి లేకపోయినా స్మార్ట్‌ఫోన్, ఖాతాలో డబ్బులుంటే చాలు కావాల్సిన కొనుగోలు చేస్తున్నారు. డబ్బులు ఎవరికైనా పంపించాలన్నా.. తీసుకోవాలన్నా అంతా చిటికెలో అయిపోతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే డిజిటల్ పేమెంట్ స్కానర్ లేని కనీసం చిరు వ్యాపారమైన లేదంటే అతిశయోక్తి కాదు.

అప్పటి నుంచే అన్ని మార్పులు

కేంద్ర ప్రభుత్వం 2016లో చేపట్టిన పెద్ద నోట్ల రద్దు అనంతరం ఆర్థిక లావాదేవిల్లో ఇబ్బందులను అధిగమించేందుకు డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించారు. కాని అవి పెద్ద వ్యాపార సంస్థలకు మాత్రమే పరిమితమయ్యాయి. నగదు వేరే వారి ఖాతాల్లోకి పోతుందన్న భయం, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న అపోహలతో గ్రామాల్లో వీటి జాడ పెద్దగా కనిపించలేదు, కానీ 2019లో వచ్చిన కోవిడ్ తర్వాత నగదు రహిత లావాదేవీలతో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో చిల్లర సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

డిజిటల్ బ్యాంకింగ్

బ్యాంకుల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. నగదు లావాదేవీలు చాలా వరకూ తగ్గిపోయాయి. వినియోగదారులు అధికంగా క్యాష్‌లెస్ ఆర్థిక లావాదేవీలు చేస్తూ ఇంటి నుంచే అన్నిరకాల సేవలు పొందుతున్నారు. ఏటీఎంల వినియోగం కూడా రోజు రోజుకు తగ్గిపోవడం గమనార్హం. ఒకప్పుడు ఏటీఎంల వద్ద డబ్బుల కోసం వినియోగదారులు బారులు తీరి ఉండేవారు. ప్రస్తుతం అలాంటి దృశ్యాలు ఎక్కడా కనిపించడం లేదు.

స్పీకర్ బాక్స్‌లతో మోసాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసానికి గురయ్యే అవకాశం ఉంది. వీటిపై అవగాహనలేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకొని కొందరు మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. వస్తువులను కొనుగోలు కేసిన తరువాత వేరే వారికి డబ్బులు బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సక్షన్ సక్సెస్‌ఫుల్ మెసెజ్‌ను దుకాణదారులకే అమౌంట్ పే చేసినట్లు చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. అయితే మార్కెట్‌లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ చెల్లింపు జరగ్గానే ఎంత మొత్తం దుకాణాదారు ఖాతాకు జమ అయ్యిందనే విషయం వాయిస్ రూపంలో వినిపిస్తుంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు.